క్లుప్తంగా

టీడీపీకి గాడిపర్తివారిపాలెం ఇన్‌చార్జి రాజీనామా

● మద్దతుగా 8వ వార్డు సభ్యురాలు సుబ్బమ్మ రాజీనామా

చీమకుర్తి: మండలంలోని గాడిపర్తివారిపాలెం టీడీపీ ఇన్‌చార్జి నారిపెద్ది వెంకట్రావు తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీకి ఆదివారం అప్పగించినట్లు వెంకట్రావు తెలిపారు. అతనికి సంఘీభావంగా గాడిపర్తివారిపాలెం 8వ వార్డు సభ్యురాలు మార్నేని సుబ్బమ్మ వార్డు సభ్యత్వానికి రాజీనామా చేసి ఆ లేఖను చీమకుర్తిలోని ఈఓఆర్డీకి సోమవారం అందించారు. పదేళ్లుగా టీడీపీకి గాడిపర్తివారిపాలెంలో సేవలందిస్తుంటే తనకు తెలియకుండా గ్రామంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు నిరసనగా రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు గ్రామంలోని పార్టీ నాయకుల మధ్య అగాధాలు పెంచుతున్నందుకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు



కొత్తపట్నంలో కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

కొత్తపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. కార్లు, బైకులు, బస్సులు, ఆటోలు, పాల వ్యాన్‌లు, అన్ని రకాల వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. మండలంలో మూడు బృందాలుగా ఏర్పడి రాత్రి వేళల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీస్ శాఖ నుంచి ఎస్సై బి.సాంబశివరావు ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కోసం కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఎటువంటి గొడవలు జరగకుండా ఎన్నికలు నిర్వహించాలని అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటును నిర్భయంగా వేసేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. మండలంలో 41,902 ఓట్లు ఉండగా, 53 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించారు. వాటిలో విద్యుత్ సౌకర్యం, ర్యాంప్‌లు, బల్లలు ఏర్పాటు చేయించి తహసీల్దార్ హేమంత్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

పొగాకు కిలో గరిష్ట ధర రూ.251

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు కిలో గరిష్ట ధర రూ.251 గా పలికినట్లు ఒంగోలు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు. మార్చి 6 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు 89,596 బేళ్లు, 1.13 కోట్ల కేజీలు అమ్ముడుపోయినట్లు చెప్పారు. సోమవారం రీజియన్ పరిధిలో రైతులు 5443 బేళ్లను తీసుకురాగా 4696 బేళ్ల కొనుగోలు చేయగా, 746 బేళ్ల తిరస్కరించినట్లు తెలిపారు. గరిష్ట ధర రూ.251, కనిష్ట ధర రూ.219 పలికినట్లు ఆయన వివరించారు.

నిరుద్యోగులను మోసం చేసిన మోదీ

ఒంగోలు టౌన్: ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తానంటూ అధికారంలోకి వచ్చి ఆ తర్వాత కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా మోదీ దగా చేశారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ విమర్శించారు. పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి 52వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఒంగోలు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న మోదీ సర్కార్.. ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు జల్లి వెంకటేష్, నగర అధ్యక్షుడు కోటి, నాయకులు పాల్గొని జార్జిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

వాసన్నను గెలిపించండి

● అభివృద్ధికి సహకరించండి
● ఎన్నికల ప్రచారంలో బాలినేని శచీదేవి



24వ డివిజన్ మంగళిపాలెంలో ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి



24వ డివిజన్ పోకలవారివీధిలో ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీకావ్య

ఒంగోలు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి (వాసన్న) గెలుపుతోనే ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని, ఎమ్మెల్యేగా ఆరోసారి ఆయన గెలిచి సిక్సర్ సాధించి మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని బాలినేని సతీమణి శచీదేవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని 24వ డివిజన్ బండ్లమిట్ట, మంగలిపాలెం, పోకల బజారు, ట్రావెల్స్ బంగ్లా రోడ్డులో సోమవారం మహిళలతో మమేకం–స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా బాలినేని శచీదేవి, వారి కోడలు బాలినేని శ్రీకావ్య ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలినేని శచీదేవి మాట్లాడుతూ 24వ డివిజన్‌లో సుమారు రూ.7 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులను వాసన్న పూర్తిచేశారని చెప్పారు. అభివృద్ధి ఎక్కడ అనే ప్రతిపక్షాల విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం చెప్పారన్నారు. డివిజన్‌లో 4.25 కోట్లతో షాదీఖానా నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేశారన్నారు. రూ.1.50 కోట్లతో నాడు–నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. రూ.40 లక్షలతో ఫిష్ మార్కెట్‌ను అభివృద్ధి చేశారన్నారు. సుమారు రూ.75 లక్షలతో రోడ్లు వేశారని వివరించారు. ఇవి కాకుండా అనేక చిన్నచిన్న పనులు ఎన్నో చేశారని తెలిపారు. కులమతాలు, పార్టీలు చూడకుండా డివిజన్‌లోని అర్హులైన పేదలు 624 మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారని, మరో 94 పట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా ఇవ్వలేకపోయామన్నారు. కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ మాట్లాడుతూ తాను ఎప్పుడూ ప్రజలకు అండగా ఉండి వాసన్న సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధికి మారుపేరైన వాసన్నను మరోసారి గెలిపించుకుంటే డివిజన్ ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేయాలని, ఎమ్మెల్యేగా వాసన్నను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు తోట సత్యం, జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, తూము పద్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు సువర్ణ, ఏపీ విద్యుత్ బోర్డు డైరెక్టర్ జిళ్లెళ్లమూడి శారద, కార్పొరేటర్లు సర్తాజ్, మాజీ కార్పొరేటర్ ఝాన్సీ, పశుసంవర్ధకశాఖ చైర్మన్ రాధ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నను చూస్తే బాధేసింది : బాలినేని శచీదేవి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసాంఘిక శక్తులు రాళ్లదాడి చేసి తీవ్రంగా గాయపరచడం చూసి బాధేసిందని బాలినేని శచీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని 24వ డివిజన్‌లో మహిళలతో మమేకం–స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. జగనన్న అదృష్టవశాత్తూ రాళ్ల దాడి నుంచి గాయంతో బయటపడ్డారని, అదే తగలరాని చోట తగిలితే అతని ప్రాణానికే ప్రమాదమని, అది ఊహించడానికే భయంగా ఉందని శచీదేవి అన్నారు. ఇటువంటి ఘటనలు మంచి సంప్రదాయం కాదన్నారు. ఏదైనా ఎన్నికల క్షేత్రంలో చూసుకోవాలే తప్ప ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకూడదని ఆమె ఆకాంక్షించారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

● వైఎస్సార్ సీపీ యువజన విభాగం బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు మేరుగు చందన్‌నాగ్



ఎన్నికల ప్రచారంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మేరుగు చందన్‌నాగ్

చీమకుర్తి రూరల్ (చీమకుర్తి): వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ యువజన విభాగం బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, మంత్రి మేరుగు నాగార్జున తనయుడు మేరుగు చందన్‌నాగ్ అన్నారు. చీమకుర్తి మండలంలోని చీమలమర్రి, మంచికలపాడు, తొర్రగుడిపాడు, ఎర్రగుడుపాడు, ఎస్సీకాలనీలో సోమవారం 'గడపగడపకు మన నాగార్జున అన్న' ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కులంలో ఎవరైనా పుడతారా అన్న చంద్రబాబుకి ఎస్సీల మీద ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. ఎస్సీలకు వైఎస్సార్ సీపీలో, నామినేటెడ్ పోస్టుల్లో, ఇతర అన్ని రంగాల్లో అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని, ప్రతి ఊరిలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ఐదేళ్లుగా సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. పథకాల ద్వారా లబ్ధి చేకూరితేనే, మంచి జరిగిందని నమ్మితేనే వైఎస్సార్ సీపీకి ఓటు వేయండని అడిగిన ఏకైక సీఎం జగనన్న అని కొనియాడారు. అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అందుకోసం సంతనూతలపాడు ఎమ్మెల్యేగా మేరుగు నాగార్జున, బాపట్ల ఎంపీగా నందిగాం సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మేరుగు చందన్‌నాగ్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరికల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ వేమ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు అత్యాల అంకయ్య, పొన్నపల్లి నాగేశ్వరరావు, జడ సుగుణరావు, మాగులూరి ఇమ్మానుయేలు, చీదర్ల శేషు, గంగిరేకు వెంకట్రావు, కిరణ్, శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పక్కాగా పోలింగ్ నిర్వహించాలి

● సంతనూతలపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ గోపాలకృష్ణ



సంతనూతలపాడులో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ గోపాలకృష్ణ



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అనూరాధ, ఎంపీడీఓ శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంతనూతలపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ గోపాలకృష్ణ సందర్శించి పలు సలహాలు, సూచనలు చేశారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కేవలం మన జిల్లాలో మాత్రమే పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ రోజు ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని కోరారు. నిష్పక్షపాత పోలింగ్ నిర్వహణకు సిబ్బంది అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పక్కాగా పోలింగ్ నిర్వహించాలని కోరారు. ఆ మేరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు తహసీల్దార్ కరిముల్లా, ఎంపీడీవో శ్రీహరి, ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారిని శ్రీమతి అనితరోజురాణి, ఎంఈవో డి.వెంకారెడ్డి, హెచ్‌ఎం రామారావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఒంగోలులో...

ఒంగోలు సెంట్రల్: పోలింగ్ నిర్వహణలో అదనపు పోలింగ్ అధికారులు (ఓపీఓ)లు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఆర్డీఓ, ఒంగోలు అసెంబ్లీ ఆర్‌ఓ సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక డీఆర్‌ఆర్‌ఎం, పీవీఆర్ బాయిస్, మున్సిపల్ హైస్కూళ్లలో, కొత్తపట్నంలో పోలింగ్ విధులు నిర్వహించనున్న 1,441 మంది ఓపీఓలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలు, పీఓలకు తగిన సహాయకారిగా ఉండాల్సిన విధానాన్ని వివరించారు.

ఓపీఓలకు శిక్షణ కార్యక్రమం

మద్దిపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓపీఓలు నిర్వహించాల్సిన విధుల గురించి మండలంలోని 203 మంది ఉద్యోగులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ అనూరాధ, ఎంపీడీఓ శ్రీహరి ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్లు పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఎన్నికల్లో ఓపీఓలు నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు. పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న తర్వాత తెలిసిన వారు ఉన్నారంటూ వెళ్లడంగానీ, వారి గ్రామం దగ్గరలోనే ఉందని ఇంటికి వెళ్లడంగానీ చేయరాదన్నారు. ఒకసారి ఎన్నికల సిబ్బంది పోలింగ్ స్టేషన్‌కు చేరుకుంటే అక్కడి నుంచి పోలింగ్ అయిపోయిన తర్వాత ఈవీఎం ప్యాడ్‌లను జమ చేసిన అనంతరం మాత్రమే వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఆశాజ్యోతి, రెవెన్యూ సిబ్బంది, ఎలక్షన్ సెల్ క్లర్క్ మరియదాసు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాలు



మాచవరం సచివాలయ సెక్రటరీకి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు



ఒంగోలు 15వ డివిజన్‌లో రాజీనామా చేస్తున్న వలంటీర్లతో కార్పొరేటర్ గోపీచంద్

నాగులుప్పలపాడు: వలంటీర్లపై నిరంతరం విషం కక్కుతున్న ఎల్లో మీడియా, చంద్రబాబు తీరుకు నిరసనగా జగనన్నకు తోడుగా ఉండాలని తామంతా నిర్ణయం తీసుకుని తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు మాచవరం, మద్దిరాలపాడు గ్రామ సచివాలయాల వలంటీర్లు తెలిపారు. సోమవారం ఆయా గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లంతా తమ రాజీనామా పత్రాలను సచివాలయ సెక్రటరీలకు అందజేశారు. తమ రాజీనామాలకు తక్షణమే ఆమోదం తెలపాలని కోరారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్ (చీమకుర్తి): మండలంలోని పి.నాయుడుపాలెం సచివాలయం పరిధిలో పాటిమీదపాలెం గ్రామాలకు చెందిన వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. వలంటీర్లపై ప్రతిపక్షాల కుట్రలను నిరసిస్తూ ఆరుగురు వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఆ పత్రాలను పంచాయతీ సెక్రటరీకి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కె.అంజలి మాలకొండయ్య, మాజీ సర్పంచ్ కె.రాఘవరెడ్డి, సర్పంచ్ కరుణప్రియ సంతోష్, మాజీ ఎంపీటీసీ కె.సుబ్బారెడ్డి, కె.శ్రీను కె.అంజయ్య పాల్గొన్నారు.

ఒంగోలు 15వ డివిజన్‌లో 36 మంది వలంటీర్లు రాజీనామా

ఒంగోలు సబర్బన్: నగరంలోని 15వ డివిజన్ వలంటీర్లు ఆ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్ ఆధ్వర్యంలో సోమవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అన్నవరప్పాడు, రామ్‌నగర్ వార్డు సచివాలయాల్లో పనిచేసిన వలంటీర్లంతా ఆయా సచివాలయాల అడ్మిన్లకు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. అన్నవరప్పాడు వార్డు సచివాలయం పరిధిలోని 21 మంది వలంటీర్లు అడ్మిన్ సునీల్‌కు, రాంనగర్ వార్డు సచివాలయం పరిధిలోని 15 మంది వలంటీర్లు అడ్మిన్ శంకర్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. రెండు వార్డు సచివాలయాల్లో కలిపి మొత్తం 36 మంది రాజీనామాలు చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలు, చర్యలకు నిరసనగా రాజీనామాలు చేశామని వారు తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విజయం కోసం కృషి చేస్తామని ప్రతినబూనారు.

సీఎంపై దాడి చేయటం ప్రజలపై దాడి చేయటమే

● దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు



మాట్లాడుతున్న చప్పిడి వెంగళరావు

ఒంగోలు సెంట్రల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై దాడి చేయటం రాష్ట్ర ప్రజలపై దాడి చేయటమే అని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చప్పిడి వెంగళరావు మాట్లాడుతూ సీఎంపై దాడిని యావత్ ప్రజానీకం ఖండించాలని పిలుపునిచ్చారు. దాడి చేసిన వారిని రాజ్యాంగేతర శక్తులుగా పరిగణించాలని కోరారు. దళిత, బహుజన, గిరిజన, ముస్లిం, క్రిస్టియన్‌ల రిజర్వేషన్లు ఎత్తివేయాలని, రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పన్నుతున్న మోదీతో జతకట్టిన టీడీపీ, జనసేన కూటమిలను ఓడించి రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. అంబేద్కర్ సేవా సమితి కన్వీనర్ చవల సురేష్, విద్యార్థి జేఏసీ కన్వీనర్ పైనం నాగరాజు, దళిత కళామండలి కన్వీనర్ వద్దముక్కల సురేష్, దళిత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పామిశెట్టి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ

నాగులుప్పలపాడు: దేశంలో కాంగ్రెస్, వామపక్షాలతోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో కాపు కళ్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం, అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో జేడీ శీలం మాట్లాడారు. ప్రతిఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. పార్టీ సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి పాలపర్తి విజేష్‌రాజు, మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఒంగోలు ఆర్‌ఓ సమీక్ష సమావేశం

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరధిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పర్యవేక్షించే అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఒంగోలు ఆర్డీఓ, ఒంగోలు అసెంబ్లీ ఆర్‌ఓ సుబ్బారెడ్డి తెలిపారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సమీక్ష సమావేశం ఉంటుందని చెప్పారు. ఎన్నికల నియమావళిని పర్యవేక్షించే సిబ్బంది, పోలీసులు, నియోజకవర్గ పరధిలోని గ్రామ రెవెన్యూ అధికారులు, మహిళా పోలీస్ సిబ్బంది సమీక్ష సమావేశంలో పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీలో ప్రోత్సాహక బహుమతులు



అవార్డులు అందిస్తున్న షయానబేగం

ఒంగోలు సెంట్రల్: ఏపీఎస్‌ఆర్టీసీలో ఉత్తమ ఆదాయం, పొదుపు పాటించిన పలువురు ఉద్యోగులకు సోమవారం ఒంగోలులోని ఆర్టీసీ డిపోలో ప్రోత్సాహక బహుమతులు అందించారు. సింగరకొండ, జాళ్లపాలెం తిరునాళ్లు సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులలో, మార్చి మాసంలో ఎక్కువ హెచ్‌ఎస్‌డీ ఆయిల్ ఆదా చేసిన డ్రైవర్లకు ప్రశంస పత్రం, నగదు బహుమతులను ట్రాఫిక్ ఏఎం షయానబేగం, ఏఈ (ఎం) విజయకుమారి, సూపరింటెండెంట్ (టి) ఆర్‌ఎం నాయక్, ఆర్‌ఏఎస్‌ఐ వెంకటరావు అందించారు. సింగరకొండ తిరునాళ్లకు రూ.3,02,365, జాళ్లపాలెం తిరునాళ్లకు రూ.3,44,256 ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

శింగరకొండ, జాళ్లపాలెం తిరునాళ్లలో అవార్డులు పొందిన వారు వీరే...

పి.వెంకయ్య (ఆర్టీసీ కానిస్టేబుల్), నాగరాజు (కండక్టర్), ఎస్.రావు (డ్రైవర్), కేఆర్ కుమార్ (కండక్టర్), బి.శ్రీహరి (డ్రైవర్), పీవై దాసు (కండక్టర్), జీ సుబ్బారావు (డ్రైవర్), ఆర్‌వీఎస్ రావు (మెకానిక్), యూ పేరయ్య (డిప్యూటీ మెకానిక్), ఎం.రాజు (కండక్టర్), ఎం.నాగబ్రహ్మం (డ్రైవర్).

మార్చిలో అవార్డులు పొందిన వారు...

పి.మాధవీలత (కండక్టర్), ఎం.కోటేశ్వరరావు (కండక్టర్), పి.శ్రీనివాసులు (కండక్టర్), ఏఎంఎస్ రావు (కండక్టర్), పి.హరిబాబు (డ్రైవర్), వై.సాంబయ్య (డ్రైవర్). హెచ్‌డీ ఆయిల్ పొదుపులో డ్రైవర్లు వై.రమణయ్య, జి.రమేష్‌కుమార్ అవార్డులు పొందారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు కాలిపోయి ఆస్తినష్టం వాటిల్లిన ఘటన సోమవారం మధ్యాహ్నం మట్టిగుంట గ్రామంలో చోటుచేసుకుంది. తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపిన సమాచారం మేరకు.. మట్టిగుంట ఎస్సీకాలనీకి చెందిన జెట్టి రాజేష్ పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన మంటలు ఎగిసిపడి పూరిల్లు మొత్తం మంటల్లో కాలిపోయింది. ఈ ప్రమాదంలో కొంత నగదుతో పాటు వస్తువులు మొత్తం కాలిపోయాయి. బాధిత కుటుంబానికి నిత్యావసరాలు, బియ్యం అందజేశారు.